

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది

వెంకోజీపాలెం, ఆగస్టు 3: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు ఉన్నట్టు అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు శనివారం మధ్యాహ్నం మూడు గంటలతో గడువు ముగిసినందున...పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు, అదేరోజు ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మెట్రో రైలుకు మరో అడ్డంకి

కొత్త మొబిలిటీ ప్లాన్ కోరిన కేంద్రం

- ఇంతకు ముందు సమర్పించిన ప్లాన్‌కు కాలదోషం
- మళ్లీ సర్వేలు, ట్రాఫిక్‌పై అధ్యయనం తప్పనిసరి
- 2018లో టీడీపీ హయాంలో ఒకసారి తయారీ
- ఆ తరువాత వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం చేయడంతో ముగిసిన కాలపరిమితి
- ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా మరోసారి రూపొందించాల్సిన పరిస్థితి
- ప్రాజెక్టు ప్రారంభం ఆలస్యం అయ్యే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు ఇప్పట్లో పట్టాలెక్కేలా లేదు. వైసీపీ ప్రభుత్వం విశాఖలో మోనో రైలు నడుపుతామంటూ ప్రగల్బాలు పలికింది. అం తకు ముందు ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రివైజ్ చేసి పంపాలని కేంద్ర ప్రభుత్వం కోరితే...నాలుగేళ్లు దానిని తొక్కి పెట్టి ఎన్నికల ముందు సమర్పించింది. దానిని పరిశీలించేలోగా ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారిపోయింది. తాజాగా రాజ్యసభలో ఓ ఎంపీ విశాఖపట్నం మెట్రో రైలు పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నించారు. దానికి దిమ్మ తిరిగే సమాధానం వచ్చింది. ప్రాజెక్టుకు రివైజ్డ్ డీపీఆర్ అయితే పంపించారు గానీ దానికి జత చేసిన కాంప్రెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)కి కాలదోషం పట్టిందని, కొత్తది పంపాల్సి ఉందని తేల్చి చెప్పింది.

ఏమిటీ మొబిలిటీ ప్లాన్?

విశాఖ నగరంలో జనాభా, ప్రజా రవాణా వ్యవస్థకు సంబంధించిన ఏర్పాట్లు, రహదారుల సంఖ్య, వాటి విస్తీర్ణం, వాహనాల సంఖ్య, వార్షిక పెరుగుదల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా చేపట్టిన చర్యలు, మెట్రో రైలు ప్రాజెక్టుతో వాటికి అనుసంధానం ఎలా?... అనే వివరాలు సమర్పించేదే మొబిలిటి ప్లాన్.

తెలుగుదేశం పార్టీ 2017లో విశాఖపట్నం మెట్రో రైలును ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా ప్రకటించింది. 2108లో అధ్యయనం చేసి మొబిలిటీ ప్లాన్



తయారుచేసింది. మొత్తం 42.54 కి.మీ. పొడవున ట్రాక్ నిర్మించాలని ప్రతిపాదించింది. దీనికి అప్పట్లో రూ.8,300 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా సమకూర్చాల్సిన రూ.4,200 కోట్లను దక్షిణ కొరియాకు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు నుంచి రుణంగా తీసుకోవాలని భావించారు. టెండర్లు పిలిచారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టు వ్యయం రూ.14,300 కోట్లకు చేరింది. మొబిలిటీ ప్లాన్ కాల పరిమితి ఐదేళ్లు. 2018లో రూపొందించినది కాబట్టి దాని గడువు 2023తో ముగిసిపోయింది. ఈ ప్రాజెక్టు ఇంకా డీపీఆర్ పరిశీలనలో ఉన్నందున కొత్త మొబిలిటీ ప్లాన్ సమర్పించాలని కేంద్రం సూచించింది.

ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కొన్ని మార్పులు చేయాలని భావిస్తోంది. నగరంలో ట్రాఫిక్ సజావుగా సాగడానికి 12 ఫ్లైఓవర్లు నిర్మించాలని వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించగా జాతీయ రహదారుల సంస్థ వాటికి ఆమోదం తెలిపింది. త్వరలోనే వాటికి టెండర్లను పిలిచే ... మిగతా 6వ పేజీలో

ఏయూ దూర విద్య విద్యార్థుల అగచాట్లు

- డిగ్రీ, పీజీ విద్యార్థులకు గడిచిన రెండేళ్లుగా అందని ఓడీ, మార్కుల లిస్టులు
- సుమారు పది వేల మంది నిరీక్షణ
- టెంప్లేట్ డిజైన్‌లో జాప్యమే కారణం

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని దూరవిద్యా కేంద్రం ద్వారా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు అధికారులు సకాలంలో సర్టిఫికెట్లు అందించడం లేదు. దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పలు డిగ్రీ, పీజీ కోర్సులను నిర్వహిస్తున్నారు. 2020-23 మధ్య సుమారు పది వేల మంది ఆన్‌లైన్‌లో నిర్వహించే డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరారు. వీరంతా ఇప్పటికే తమ కోర్సులను పూర్తిచేశారు. వీరికి సాధారణంగా కోర్సు పూర్తయిన రెండు నెలల్లో ఒరిజినల్ డిగ్రీలను అందించాలి. అలాగే, మార్కుల లిస్టులను అందించాలి. అయితే కోర్సులు పూర్తయి, ఫలి తాలు విడుదలై నెలలు దాటుతున్నా విద్యార్థులకు అధికారులు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. ఇది ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఇబ్బందిగా పరిణ మిస్తోంది. ఉద్యోగాలు, ఇతర అవసరాలకు ఆ సర్టిఫికెట్లను వినియోగించుకోలేకపోతున్నామని విద్యార్థులు వాపో తున్నారు.

సుదూర ప్రాంతాలు నుంచి రాక..

ఏయూ దూరవిద్యా కేంద్రం ద్వారా చదువుకునే వారిలో అనేక మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. వీరంతా సర్టిఫికెట్ల కోసం దూర విద్యా కేంద్రానికి వస్తున్నారు. అధికారులు సమయం పడుతుందని చెబుతుండడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. పీజీ కోర్సు పూర్తి చేసి ఆరు నెలలు అవుతోందని, సర్టిఫికెట్లు కోసం వస్తే సమయం పడుతుందని చెబుతున్నారని గుంటూరు జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి వాపోయారు. కంపెనీలో ప్రమోషన్ లభిస్తుందని పీజీ చేస్తే..సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఎక్కువ సమయం తీసుకోవడం వల్ల ఇబ్బంది అవుతోందంటూ పేర్కొన్నాడు. ఈ విషయాన్ని ... మిగతా 6వ పేజీలో

ప్రజారోగ్యానికి పొగ



అపరిశుభ్ర వాతావరణంలో వంటలు

నగరంలో నిల్వ ఉంచిన, నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయం

- రోడ్డు పక్క బండ్ల నుంచి పెద్ద హోటళ్ల వరకూ అదే పరిస్థితి
- వంటశాలల్లో కనిపించని పరిశుభ్రత
- అనారోగ్యం బారినపడుతున్న జనం
- విరేచనాలు, వాంతులతో ఆస్పత్రులపాలు
- ఒకసారి వేడి చేసిన నూనెను పదేపదే వినియోగించడం వల్ల దీర్ఘకాలిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందంటున్న వైద్యులు
- తూతూమంత్రంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు
- జనాభాకు అనుగుణంగా లేని సిబ్బంది
- లక్ష మంది జనాభాకు ఒక ఇన్‌స్పెక్టర్ అవసరం
- ప్రస్తుతం జిల్లాలో 25 లక్షల మంది జనాభా.. సేవలు అందిస్తున్నది ముగ్గురే

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న రాజేంద్ర ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని ఒక రెస్టారెంట్‌లో చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. పార్శిల్ ఓపెన్ చేసి తినేందుకు సిద్ధమవుతుండగా తల వెంట్రుకలతో పాటు ఈగలు ఉండడం గుర్తించాడు. వెంటనే హోటల్‌కు తీసుకువెళ్లి చూపించాడు. తాము శుభ్రమైనదే ఇచ్చామని చెప్పి యజమాని బుకాయించాడు.

మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన శివాజీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో నాలుగు రోజుల కిందట చికెన్ ఫ్రైడ్ రైస్ తిన్నాడు. ఇంటికి వెళ్లినప్పటి నుంచి కడుపులో వికారంగా అనిపించింది. తెల్లవారుజాము నుంచి విరేచనాలు మొద లయ్యాయి. ఆస్పత్రికి వెళ్లగా...నిల్వ ఉంచిన మాంసాహారం తీసుకోవడం వల్లే ఇలా జరిగినట్టు వైద్యులు తెలిపారు. రెండు రోజులు ఇన్‌పేషెంట్‌గా ఉంచారు.

రోడ్డుపక్కన తోపుడు బండ్ల వ్యాపారులతో పాటు హోటళ్లలోనూ నిల్వ ఆహారాన్ని విక్రయిస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలు తయారుచేస్తున్నారు. అనేక ప్రముఖ హోటల్స్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడి చేసి కస్టమర్లకు అందిస్తున్నట్టు పలుమార్లు ఆహార భద్రత, ప్రమాణాల అధికారులు తనిఖీల్లో తేలింది. ఈ నేపథ్యంలో బయట ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో బయట ఆహారానికి వీలైనంత వరకు దూరంగా ఉండడం ద్వారా డయేరియా వంటి బారినపడ కుండా ఉండవచ్చునని చెబుతున్నారు.



నిల్వ వుంచిన ఆహార పదార్థాలు

ఇబ్బడిముబ్బడిగా ఆహార విక్రయ కేంద్రాలు

నగర పరిధిలో టిఫిన్ సెంటర్లు, హోటల్స్, రెస్టారెంట్లు, స్నాక్ పాయింట్లు, న్యూడుల్స్ సెంటర్లు, పానీపూరీ బండ్లు, పకోడీ పాయింట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రతి సందులోనూ ఐదు నుంచి పది దుకాణాలు ఉంటున్నాయి. సాధారణంగా ఆహార పదార్థాలు విక్రయించేవాళ్లు లైసెన్స్ తీసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం చేయాలి. అయితే ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్లు, పెద్ద పెద్ద ఫుడ్ కార్నర్స్ మినహా చాలామంది ఆ నిబంధనలేవీ పాటించడం లేదు. ఇష్టానుసారంగా ఫుడ్ పాయింట్లు పెట్టి తమకు నచ్చిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. జిల్లాలో రెండు వేల మంది మాత్రమే తోపుడు బండ్లకు రిజిస్ట్రేషన్లు చేయించుకోగా, మరో వేయి వరకు హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులు లైసెన్స్ తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

నిల్వ ఉంచిన పదార్థాలు విక్రయం..

నగర పరిధిలోని ప్రముఖ హోటళ్లతోపాటు టిఫిన్ సెంటర్లు, స్నాక్ పాయింట్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయించడం పరిపాటిగా మారింది. ముందురోజు మిగిలిపోయిన చికెన్, మటన్, చేప, బిర్యానీ వంటి ఆహార పదార్థాలను మరుసటిరోజు వేడి చేసి వినియోగదారులకు అందిస్తున్నారు. ఆహార, ... మిగతా 6వ పేజీలో



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

3,800 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం ప్రాంతంలోని ప్రకాష్‌నగర్‌లో గల ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 3,800 కిలోల రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక సర్కిల్ ఏఎస్‌వో టి.కృష్ణ, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ పద్మ దాడి చేసి బియ్యం పట్టుకున్నట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు తెలిపారు. అదేవిధంగా నాతయ్యపాలెంలో ఒక ఇంట్లో 300 కిలోలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోస్టింగ్‌కు పోటీ

విశాఖ జిల్లాకు వచ్చేందుకు అనకాపల్లి, అల్లూరి జిల్లాల తహసీల్దార్లు పోటీ

- కలెక్టర్‌ను కలిసిన 13 మంది...
- ఇప్పటికే ఇక్కడ ముగిసిన ప్రక్రియ
- ప్రస్తుతం రెండే ఖాళీలు
- ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఆ రెండు జిల్లాల్లో పోస్టింగ్‌ల కోసం ఈసీ అనుమతికి కలెక్టర్ల లేఖ

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం జిల్లాకు వచ్చేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పలువురు తహసీల్దార్లు పోటీ పడుతున్నారు. సుమారు 13 మంది తహసీల్దార్లు స్వయంగా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర్ ప్రసాద్‌ను కలిసి విజ్ఞానపత్రాలు అందజేశారు.



సాధారణ ఎన్నికల సమయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను ప్రభుత్వం వెనక్కి పంపింది. విశాఖ జిల్లా నుంచి వెళ్లిన తహసీల్దార్లు వెనక్కి రావడంతో వారం క్రితమే పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తహసీల్దార్లకు ఇంకా పోస్టింగ్స్ ఇవ్వలేదు. ఈలోగా కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రాతిపదికగా కాకుండా ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా తీసుకుని పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే విశాఖ జిల్లాలో ఇప్పటికే పోస్టింగ్స్ ఇవ్వడంతో ఇక్కడ మార్పే అవకాశం లేదని అంటున్నారు. ఇదిలావుండగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో కోడ్ అమలులోకి వచ్చింది. అందువల్ల అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తహసీల్దార్లకు పోస్టింగ్స్ కోసం ఎన్నికల కమిషన్ అనుమతికి లేఖ రాశారు. ఇదే సమయంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వచ్చిన తహసీల్దార్ల పోస్టింగ్స్‌కు సంబంధించి జాబితా రూపొందించే పనిలో రెండు జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. పోస్టింగ్ సంబంధిత అధికారి సొంత రెవెన్యూ డివిజన్‌లో ఇవ్వకూడదు. ఇంకా ఎన్నికలకు ముందు పనిచేసిన అసెంబ్లీ నియోజకవర్గంలో పనిచేయకూడదని ప్రభుత్వం స్పష్టంచేసింది. దీనికి లోబడి అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పోస్టింగ్స్ జాబితాలు తయారు చేయాలని సూచించింది. ఈ రెండు నిబంధనలకు లోబడి పోస్టింగ్స్ ఇచ్చే క్రమంలో ఇబ్బందులు వస్తే ఆ రెండు జిల్లాల మధ్య బదిలీలు చేయాలని యోచిస్తున్నారు. ఉదాహరణకు పాడేరు డివిజన్‌లో పుట్టి అక్కడే తహసీల్దారుగా ఉన్న అధికారికి అక్కడే పోస్టింగ్ ఇవ్వడం సాధ్యంకాదు..అందువల్ల అటువంటి అధికారులను అల్లూరి జిల్లా నుంచి అనకాపల్లి/విశాఖకు ... మిగతా 6వ పేజీలో

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కైలాసగిరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

- రాత్రిపూట బస చేసేందుకు ఏర్పాట్లు
- రివాల్వింగ్ రెస్టారెంట్ కూడా ఏర్పాటుచేస్తాం
- మధురవాడలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్
- మారికవలసలో ఐటీ పార్కు... నాలుగు టవర్ల నిర్మాణం
- వేర్వేరుచోట్ల లేఅవుట్లలో మిగిలిపోయిన వేయి ప్లాట్లకు త్వరలో వేలం
- మధ్య తరగతికి అందుబాటు ధరల్లో లేఅవుట్లు వేసే ఆలోచన
- చెరువులను సంరక్షిస్తాం
- వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని కైలాసగిరిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. సిరిపురం ఉద్యోగ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కైలాసగిరిపై రాత్రి పూట ఉండడానికి కొన్ని నిర్మాణాలు చేపట్టామన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా రివాల్వింగ్ రెస్టారెంట్ కూడా ఏర్పాటు చేస్తామని, ఎక్కువ మంది అక్కడికి వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

వీఎంఆర్‌డీఏకు ప్లాట్ల వేలం ద్వారానే అధిక ఆదాయం వస్తుందని, గత కొంతకాలంగా ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. ఇప్పటివరకూ వేసిన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లు, ఆడ్ బిట్లు కలిపి సుమారు వేయి వరకు ఉన్నాయని, వాటిని త్వరలోనే వేలానికి పెడతామన్నారు. మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో లేఅవుట్లు వేసే ఆలోచన కూడా ఉందన్నారు. పాలవలస లేఅవుట్‌కు మంచి ఆదరణ లభించిందని, రఘుమండ, జియ్యమ్మవలస, గరివిడి, చోడిపల్లిలలో అభివృద్ధి చేస్తున్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో భూగర్భ కాలువలు, రహదారులు, ... మిగతా 6వ పేజీలో

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్

- జిల్లాలో 5,732 మందికి పాఠ్య పుస్తకాలతోపాటు నోట్ బుక్స్ పంపిణీ



ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

మద్దిలపాలెం, ఆగస్టు 3: సుమారు నాలుగేళ్ల తరువాత జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ కూడా ఈ ఏడాది ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు రూ.1800 విలువైన పుస్తకాలు ఉచితంగా రావడంతో విద్యార్థులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. రాష్ట్ర విద్యా శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లాలోని పది ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం జనరల్‌లో 1,915 మంది, ఒకేషనల్ 1,270 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సుల్లో 1,606, ఒకేషనల్ కోర్సులో 1,112 మంది చదువుతున్నారు. వీరందరికీ ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందుకు సుమారు రూ.1.32 కోట్లు వెచ్చించారు. సైన్స్ విద్యార్థులకు ఆరు పాఠ్యపుస్తకాలు, ఆరు నోటు పుస్తకాలు, ఆర్ట్స్ విద్యార్థులకు ఐదు పాఠ్య పుస్తకాలు, ఐదు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో పేదవారే...

గత వైసీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యను నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేదవారే చదువుతారనే విషయం కూడా పక్కన పెట్టి, ఉచిత పుస్తకాలు పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేసింది. దీంతో ఫలితాలు ఘోరంగా పడిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇచ్చిన మాట ప్రకారం నలభై రోజుల్లోనే ఉచిత పుస్తకాలు పంపిణీ చేయడంపై విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎనబై అడుగుల రోడ్డులో ఆక్రమణల తొలగింపు



రోడ్డు మధ్యలోని ఇళ్ల నిర్మాణ సామగ్రిని తొలగిస్తున్న పోలీసులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 3: తాటిచెట్లపాలెం ఎనబై అడుగుల రోడ్డులో ఆ క్రమణలను నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం తొలగించారు. క్రేన్ సహాయంతో కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను తొలగించారు. మరోసారి రోడ్డు పైగానీ, ఫుట్‌పాత్‌పై గానీ వాహనాలను పార్కింగ్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే, రోడ్డుకు అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రిని తొలగించడంతో పాదచారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

కెమికల్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు

కంచరపాలెం, ఆగస్టు 3 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విశాఖ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణతో పాటు పలువురు అధ్యాపకులు, 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ రక్తదానం ఆపదలో మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ బ్లడ్ బ్యాంకు ప్రాజెక్టు డైరెక్టర్ డి.రామ్ రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలంటూ వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి వినతి పత్రమిస్తున్న బాధితుడు, గ్రామపెద్దలు

సీతమ్మధార, ఆగస్టు 3: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలో నివాసముంటున్న నక్క రాజశేఖర్‌రెడ్డి.. తన ఇంటి పక్కనున్న భీశెట్టి కుమార్‌బాబు, అతని సోదరి మాధవి చాలాకాలంగా తమ కుటుంబాన్ని వేధింపులకు గురిస్తున్నారని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. తన ఇంట్లోని కుటుంబ సభ్యులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు రోజులుగా తన ఇంటి ప్రహరీని పగులగొట్టి, బెదిరింపులకు పాల్పడుతున్నట్టు రాజశేఖరరెడ్డి ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సీఐతో ఫోనులో మాట్లాడి కుమార్‌బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నక్కవానిపాలెం గ్రామ కమిటీ పెద్దలు, దొడ్డి పెద్దలు కూడా ఎమ్మెల్యేకు కుమార్‌బాబు తీరుపై ఫిర్యాదు చేశారు. రోడ్డుపై వెళ్తున్న మహిళలకు అసభ్యకరంగా సైగలు చేస్తున్న వీడియోలను చూపించారు.

మధ్యాహ్న భోజనాలు సక్రమంగా అందించాలి

▸▸ **కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

జగదాంబ కూడలి, ఆగస్టు 3: పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకంను సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ వన్‌టౌన్ పాతపోస్టాఫీసు వద్దనున్న జీవీఎంసీ పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనాలను స్వయంగా రుచిచూసి నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. చిన్నారుల్లోవిద్యాప్రమాణాలను పెంచేలా బోధించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రభుత్వపరంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫారం, బ్యాగులు చిన్నారులకు అందాయా..లేదా అని ఆరాతీశారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టాయిలెట్స్ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇబ్బందులుంటే విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలమని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



పాతపోస్టాఫీసు వద్ద జీవీఎంసీ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం రుచి చూస్తున్న కలెక్టర్

తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి

▸▸ **కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



బాలింతకు పోషకాహార కిట్ అందిస్తున్న కలెక్టర్, వైద్యులు

జగదాంబ కూడలి, ఆగస్టు 3: బిడ్డకు తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు.శనివారం ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలో భాగంగా ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని మహిళా శిశు సంక్షేమశాఖ ఉద్యోగులను ఆదేశించారు. పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువు మెదడు చురుగ్గాపనిచేస్తుందన్నారు. తల్లులకు బ్రెస్ట్, అండాశయ క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. అనంతరం బాలింతలకు పోషకాహార కిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్, ఆర్ఎంవో పి.రాధారాణి, ఎస్ఎన్‌ఈయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి. బిందుమాధవి, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి జయదేవి, పిల్లల వైద్య నిపుణులు చంద్రశేఖర్, ప్రవీణ, గౌతమి, అంగన్‌వాడీ ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి ఉద్యోగులు విజయకుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌కు ఉద్యోగ విరమణ వీడ్కోలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 3: ఉద్యోగ విరమణ చేసిన జీవీఎంసీ మాజీ చీఫ్ ఇంజనీర్ పి. రవికృష్ణరాజును ఘనంగా సన్మానించారు. జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వీడ్కోలు సభకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడారు. రవికృష్ణరాజు సేవలు మరువలేనివని కొనియాడారు. అతనిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ సభకు జీవీఎంసీ ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ ఎం.వినయ్‌కుమార్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. సన్మానగ్రహీత రవికృష్ణరాజు మాట్లాడుతూ సభ్యులకు, తనకు సహాయసహకారాలు అందించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎస్ఈ కేవీఎన్ రవి, చైర్మన్ జగన్నాథం, కన్వీనర్ రాజాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి రంధిసాదురావు, పి.ఎస్.ప్రసాద్, రాజు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ పలాస చేరే వేళలు సవరింపు

విశాఖపట్నం, ఆగస్టు 3: విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే 18526 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు పలాస స్టేషన్ చేరే సమయాన్ని సవరించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈ రైలు మధ్యాహ్నం 3.00 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.43 గంటలకు పలాస చేరి, తిరిగి అక్కడ నుంచి 6.48 గంటలకు బయలుదేరే విధంగా మార్పు చేసినట్టు పేర్కొన్నారు. సవరించిన వేళలు ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. అలాగే గుణుపూర్ నుంచి సంబల్‌పూర్ సిటీ వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18118) రైలు పలాస నుంచి పలు స్టేషన్లకు చేరే వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్టు వివరించారు.

'తుపాకీ సంస్కృతితో మానవ మనుగడకు ముప్పు'

సీతమ్మధార, ఆగస్టు 3: తుపాకీ సంస్కృతితో మానవ మనుగడకు వినాశమని వక్తలు ఆందోళన వ్యక్తంచేశారు. బుల్లయ్య కళాశాలలో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో 'తుపాకీ సంస్కృతి' అనే అంశంపై సదస్సును సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహిచారు. ముఖ్య వక్తలు ఆచార్య బాలమోహన్‌దాస్, ఆచార్య కె. రవి, ఆచార్య పద్దయ్య, డాక్టర్ కేవీఎస్ఎం మూర్తి మాట్లాడుతూ అగ్ర రాజ్యం అమెరికాలో తుపాకీ సంస్కృతి పెరుగుతుండడం విచారకరన్నారు. ఇటీవల ఆ దేశ మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై జరిగిన తుపాకీ కాల్పులను అందరూ ఖండించాలన్నారు. భారత దేశంలోనూ హింసకు అనేక మంది నాయకులను కోల్పోయామన్నారు. ప్రపంచ శాంతి కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో బ్రహ్మకుమారీ రమ, మహ్మద్ మున్నార్, బి.చిన్నారావు, హుస్సేన్, దాట్ల బాబూరావు రెడ్డి, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఇండియన్ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

సీతంపేట, ఆగస్టు 3: ఇండియన్ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా స్థానిక ద్వారకానగర్ జోనల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్యాంకు జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్వే ప్రారంభించారు. స్థానిక మేనేజర్లు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్వే మాట్లాడుతూ బ్యాంక్, జోనల్ ఆఫీసు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ కోసం మొక్కలు నాటడం, ఇతర సీఎస్ఆర్ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. సామాజిక ప్రయోజన కార్యక్రమాల్లో తమ బ్యాంకు ఎల్లప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని సిబ్బందికి, వారి పిల్లల కోసం వివిధ రకాల పోటీలు, సాస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'అవయవ దానానికి ముందుకు రావాలి'



మాట్లాడుతున్న సంఘం చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి

సీతంపేట,ఆగస్టు 3: అవయవ దానానికి స్వచ్ఛందంగా అందరూ ముందుకు రావాలని కేజీహెచ్ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ శివానంద పేర్కొన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని శనివారం అఖిల భారత అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ శివానంద మాట్లాడుతూ మరణం తర్వాత కూడా జీవించాలంటే అవయవ దానం చేయాలని కోరారు. అవయవదానం వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఏఎంసీ అనాటమీ విభాగ అధిపతి రవీంద్ర కిశోర్ మాట్లాడుతూ అవయవ దానం వైద్య విద్యార్థులకు ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. అఖిల భారత అవయవ దాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరి సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో అవయవ దానంకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోబ్రహ్మ కుమారీస్ ప్రతినిధి రామేశ్వరి, రక్తదానం ఉద్యమకర్త వినోద్‌బాలు, సీఐఎస్ఎఫ్ అధికారి డాక్టర్ ఎస్. కురణరాజు, సీనియర్ సిటిజన్ ఫణి, ఏఎంసీ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, సంస్థ కార్యదర్శి ఎస్.బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భళ్లమూడి'కి అంగర సూర్యారావు పురస్కారం



భళ్లమూడి రామమూర్తికి పురస్కారమందిస్తున్న అతిథులు

సీతంపేట, ఆగస్టు 3: ప్రముఖ నాటక రచయిత, కథకుడు అంగర సూర్యారావు జీవన సాఫల్య పురస్కారాన్ని నాటక ప్రదర్శనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న భళ్లమూడి రామమూర్తికి అందజేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపకులు, కథకుడు అంగర సూర్యారావు 97వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు జీవన సాఫల్య పురస్కారం రామమూర్తికి అందించారు. నగదుతోపాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అతిథులు అందచేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకర్ మాట్లాడుతూ అంగర సూర్యారావు గొప్ప కథకులని కొనియాడారు. సాహితీవేత్త పురిపండా అప్పలస్వామి చరిత్ర, అంగర సూర్యారావు రాసిన డైరీని పుస్తక రూపం తేవడానికి కృషి చేసిన అంగర కృష్ణారావు, అంగర వెంకట్‌కు అభినందనలు తెలిపారు. ఈ సభకు అడపా రామకృష్ణ అధ్యక్షత వహించారు. బాదంగిరి సాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపకులు, నటులు పి.వి. మాధవ్ నాటక ప్రయోక్త సత్కారం అందుకున్నారు. పురిపండా పుస్తకాన్ని డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, సూసర్ల సర్వేశ్వరరావు, శిరేల సన్యాసిరావు, ఎం.పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జువైనల్ హోంకు బాలుడి తరలింపు

సీతంపేట, ఆగస్టు 3: బాలికను మోసగించిన కేసులో మైనర్ యువకుడిని నాలుగో పట్టణ పోలీసులు జువైనల్ హోమ్‌కి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వే న్యూకాలనీ ప్రాంతానికి చెందిన బాలికను పదోతరగతి చదువుతున్న సమయంలో ఆ బాలుడు పరిచయం చేసుకున్నాడు. మోసపూరితమైన మాటలతో ఆ బాలికను ఇంట్లో ఎవరు లేని సమయంలో లోబరుచుకున్నాడు. కొద్దినెలలకు బాలిక గర్భవతి అయినట్టు ఆమె తల్లి గుర్తించారు. చికిత్స కోసం ఆమెను కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా.. ఆసుపత్రి వర్గాలు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పాటు బాలిక తల్లి కూడా ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు కావడంతో ఏసీపీ విచారణ చేపట్టి నిందితుడిని జువైనల్ హోమ్‌కి తరలించారు.

కేజీహెచ్‌కు వాషింగ్ మెషిన్ వితరణ

మహారాణిపేట, ఆగస్టు 3: కేజీహెచ్‌లో నవజాతి శిశువుల వైద్య విభాగానికి విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థ హైటెక్ వాషింగ్ మెషిన్ వితరణగా అందించింది. శనివారం సంస్థ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు ఈ మెషీన్‌ను అందించారు. ఆస్పత్రి వర్గాల అభ్యర్థన మేరకు నవజాత శిశువుల దుస్తులు, డైపర్లు శుభ్రపరించేందుకు దీనిని అందించినట్టు చెప్పారు. వైద్యులు సత్యవాణి, పద్మావతి, సందీప్ పాల్గొన్నారు.

14 స్కూలు బస్సులు, ఆటోపై ఆర్టీఏ కేసులు

మురళీనగర్, ఆగస్టు 3 ; విశాఖపట్నం ఆర్టీఏ కార్యాలయ పరిధిలో 14 స్కూలు బస్సులు, ఒక ఆటోపై ఆర్టీఏ అధికారులు శనివారం కేసులు నమోదు చేశారు. కైలాసపురం, తాటిచెట్లపాలెం, బీచ్ రోడ్డు పరిధిలో జరిపిన తనిఖీల్లో ఈ కేసులు నమోదు చేసినట్టు డీటీసీ జి.సి.రాజారత్నం తెలిపారు. అలాగే, జూన్ 13వ తేదీ నుంచి 74 కేసులు నమోదు చేసి, 8 బస్సులు సీజ్ చేసినట్టు వివరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మాధవి, మన్మోహన్, బాలాజీ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

మహారాణిపేట, ఆగస్టు 3: జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్లు శనివారం కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు గంట్ల శ్రీనుబాబు, పోతుమహంతి నారాయణ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులం దరికీ రూ. 1250 చొప్పున ఆరోగ్య బీమా చెల్లించాలని, పిల్లల స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి మెడిక్లెయిమ్ చెల్లింపులపై తగిన చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఈరోతి ఈశ్వరావు డి. రవికుమార్, ఎన్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కైలాసగిరి

... 5వ పేజీ తరువాయి

తాగునీరు, విద్యుద్దీకరణ వంటిమౌలిక వసతులు వీలైనంత త్వరగా కల్పిస్తామన్నారు.

చెరువులకు కొత్తరూపు

నగరం, పరిసర ప్రాంతాల్లో 520 వరకు చెరువులు ఉన్నాయని, అయితే చాలా వాటిలో నీరు లేదని, ఎండిపోయి మట్టితో పూడుకుపోయాయని, అటువంటివి ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని కాపాడేందుకు జీవీఎంసీతో కలిసి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అవి మళ్లీ నీటితో కళకళలాడేలా, జన సందర్శనకు వీలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ తరహా పనులు కొన్ని స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయని, వాటి సాయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఆక్రమణలకు గురైన, నిర్మాణాలు జరిగిన చెరువుల జోలికి వెళ్లబోమన్నారు. వర్షం పడితే చెన్నై, బెంగళూరు వంటి నగరాలు నీటిలో మునిగిపోతున్నాయని, విశాఖపట్నానికి అటువంటి సమస్య రాకుండా ఉండేందుకు ముందుచూపుతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

ఐటీ పార్కులో నాలుగు టవర్లు

మారికవలసలో హరిత ప్రాజెక్టు సమీపాన వీఎంఆర్‌డీఏకు 20 ఎకరాల వరకు ఉందని, అందులో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించి పనులు ఆపేశారని, దానిని మళ్లీ ఇప్పుడు పునరుద్ధరణ చేయబోతున్నామన్నారు. ఐటీ సంస్థలకు ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో ఇచ్చేలా నాలుగు టవర్లు నిర్మించాలని యోచిస్తున్నామన్నారు. ఒక టవర్‌లో 31 అంతస్థులు నిర్మించాలనే ఆలోచన ఉందన్నారు. అక్కడే కమర్షియల్ కాంప్లెక్స్‌లు, రెసిడెన్షియల్ ఏరియా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించాల్సి ఉందన్నారు.

అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్

మధురవాడలో అందుబాటులో ఉన్న స్థలంలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. యువతను ఎక్కువగా ఆకట్టుకుంటున్న ఆగ్మెంటెడ్ రియాల్టీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడా వినోదం అందిస్తామన్నారు. ఇది సాధారణ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్లకు భిన్నంగా ఉంటుందన్నారు.

- ఎన్ఏడీ జంక్షన్‌లో ఆర్ఓబీతో పాటు సబ్ వే కూడా నిర్మించాలని కోరుతున్నారని, త్వరలో ఆ పనులు కూడా చేపడతామన్నారు. చీమలాపల్లి, ఎండాడల్లో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్లు, మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామని చెప్పారు.

అందరితో చర్చించి మాస్టర్ ప్లాన్ రహదారులు

ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ రెండు మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నదని, ఇంకా ఎక్కడెక్కడ అవసరమో ఏపీఐఐసీ, టూరిజం, నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అన్నింటికి ఆన్‌లైన్ పేమెంట్

వీఎంఆర్‌డీఏకు వాణిజ్య సముదాయాలు, కళ్యాణ మండపాలు, చిల్డ్రన్ ఎరీనా, పార్కులు, మ్యూజియాలు ఉన్నాయని, వీటన్నింటినీ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. సంస్థ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదని ఆలోచించి ప్రాధాన్యం ప్రకారం పనులు చేపడతామన్నారు.

సిబ్బంది భర్తీకి చర్యలు

సంస్థలో సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని, దాంతో పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పనులు ఏమీ జరగడం లేదని వివరించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, డ్రాఫ్ట్‌మెన్లు, వీఆర్ఓ పోస్టులు వంటివి భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఐటీ సెల్‌ను బలోపేతం చేసి, వెబ్‌సైట్‌ను మరింత జనరంజకంగా మార్చి, సోషల్ మీడియాలో కూడా వీఎంఆర్‌డీఏ ఉండేలా చేస్తామన్నారు.

రూ.4 కోట్లు స్వాహా కేసులో నిందితుడి కోసం గాలింపు

ముమ్మరంగా దర్యాప్తు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పనిచేస్తున్నాడని సంస్థ అకౌంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.4 కోట్లు స్వాహా చేసి పరారైన ప్రబుద్ధుడి కోసం ఎంవీపీ పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన సీహెచ్ రాధాకృష్ణమూర్తి (80) ఇరవై ఏళ్ల కిందట విశాఖలో స్టోన్‌క్రషర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. తన వ్యాపారానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఆడిట్ వ్యవహారాలు చూసేందుకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని తంగేడుకు చెందిన చిటికెల గోవింద్‌ను 2010లో అకౌంటెంట్‌గా తీసుకున్నారు. రాధాకృష్ణమూర్తి అనారోగ్యం బారినపడడంతో 2016లో తన స్వస్థలానికి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన కుమార్తె ద్వారా కొంతకాలంపాటు వ్యాపారం నడిపించారు. అయితే ఆమె నగరానికి రావడం సాధ్యం కాకపోవడంతో స్టోన్ క్రషర్‌ను నాలుగు కోట్ల రూపాయలకు విక్రయించారు. ఆ సొమ్మును తన ఖాతాలో డిపాజిట్ చేసుకున్నారు. అయితే ఫోర్జరీ సంతకాలు, తప్పుడు డాక్యుమెంట్లతో రాధాకృష్ణమూర్తి ఖాతాలోని దాదాపు నాలుగు కోట్ల రూపాయలను అకౌంటెంట్ గోవింద్ తన ఖాతాలకు మళ్లించుకున్నాడు. దీనిపై రాధాకృష్ణమూర్తి ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గోవింద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో రాధాకృష్ణమూర్తి జూన్ 12న అప్పటి సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిశారు. అలాగే ఇటీవల ఆయన అల్లుడు అప్పయ్య చౌదరి ప్రస్తుత పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సీపీ వెంటనే ఎంవీపీ సీఐ సంజీవరావుకు ఫోన్ చేసి కేసు దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నిందితుడి ఆచూకీ తెలుసుకునేందుకు వారి కుటుంబ సభ్యుల సెల్ ఫోన్ కాల్ డేటా, నిందితుడి బ్యాంకు ఖాతాలు పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు సీఐ సంజీవరావు శుక్రవారం సీతమ్మధారలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు వెళ్లి బాధితుడి బ్యాంకు ఖాతాతో పాటు నిందితుడి గోవింద్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. తదుపరి దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఐ సంజీవరావు తెలిపారు.

మెట్రో రైలుకు మరో అడ్డంకి

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున, ఆ ఫ్లైఓవర్లు, మెట్రో రైలు స్టేషన్లను ఇంటిగ్రేట్ చేస్తూ కొత్త ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల విశాఖపట్నం వచ్చినప్పుడు మెట్రో రైలు అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ల నిర్మాణం మంచిదా?, ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే మంచిదా? ఆలోచించి తనకు చెప్పాలని కోరారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇబ్బంది లేకుండా మార్పులు చేయాలని సూచించారు. అంటే కేంద్రం కోరిన మొబిలిటీ ప్లాన్ కూడా ఇందులో కీలకం కానుంది. నగరంలో బీఆర్‌టీఎస్ రహదారులు, వాహనాల సంఖ్య, ఏయే జంక్షన్లలో ఎంతెంత ట్రాఫిక్ ఉంటున్నదీ కొత్తగా అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా మెట్రో రైళ్ల సంఖ్య, వాటికి బస్సుల అనుసంధానం వంటివి సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ పరిశీలించాకే కేంద్రం నుంచి ఆమోదం లభిస్తుంది. అప్పుడు పీపీపీలో చేయడానికి ఎవరు ముందుకు వస్తారనేది తేలుతుంది. ఆ తరువాతే ప్రాజెక్టు ముందుకు వెళుతుంది.

ప్రజారోగ్యానికి పొగ

... 5వ పేజీ తరువాయి

భద్రతా ప్రమాణాలు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అనేకసార్లు ఈ విషయం రుజువయ్యింది. ముందురోజు మిగిలిన పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టి మరుసటిరోజు వేడి చేసి విక్రయించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఒకసారి వేడి చేసిన నూనెను..ఆ తరువాత మళ్లీ మళ్లీ వినియోగించడం చాలా ప్రమాదకరమంటున్నారు. సాధారణంగా ఒక్కసారి కూడా వినియోగించని నూనెలో టీపీసీ (టోటల్ పోలార్ కాంపౌండ్) వాల్యూ ఆరు శాతం ఉంటుంది. రెండుసార్లు నూనెను వేడి చేస్తే 20 నుంచి 25 శాతానికి ఈ విలువ పెరుగుతుంది. అది 25 శాతానికి మించితే ఆరోగ్యానికి హానికరంగా భావించాల్సి ఉంటుంది. అయితే, పదేపదే నూనె వేడి చేసి, అందులోనే ముందురోజు మిగిలిన ఆహార పదార్థాలను వేడి చేసి విక్రయిస్తుంటారు. ఇది ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా వైద్యులు చెబుతున్నారు. దీనివల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలు వేధిస్తాయి. అలాగే, దీర్ఘకాలంలో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నియంత్రణ ఏదీ..?

జిల్లాలో ఆహార పదార్థాల విక్రయాలపై అధికారుల నియంత్రణ లేకపోవడం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణమవుతోంది. ఆహార భద్రతా, ప్రమాణాలు అధికారులు నిరంతరం పర్యవేక్షించడం ద్వారా మాత్రమే ఈ తరహా వాటికి అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే, ఆ శాఖలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తగినంతమంది లేకపోవడం సమస్యగా మారింది. జిల్లాలో ముగ్గురే ఇన్‌స్పెక్టర్లు ఉండడం వల్ల విస్తృతంగా తనిఖీలు చేయలేకపోతున్నట్టు చెబుతున్నారు. సాధారణంగా లక్ష జనాభాకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. కానీ, జిల్లాలోని 25 లక్షల జనాభాకు ముగ్గురే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. దీంతో విస్తృతంగా తనిఖీలు చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఇది కూడా వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించేందుకు కారణమవుతోంది.

తెలంగాణలో ల్యాబ్..

అధికారులు తనిఖీలకు వెళ్లిన సందర్భంగా సేకరించిన నమూనాలను పరీక్షించిన తరువాత గానీ శిక్ష విధించేందుకు అవకాశం లేదు. అయితే జిల్లాలోనే కాదు...రాష్ట్రంలో కూడా ఆహార పదార్థాలను తనిఖీ చేసే ల్యాబ్ లేదు. తెలంగాణలోని హైదరాబాద్‌లో ల్యాబ్ ఉండడంతో అక్కడికే నమూనాలను పంపిస్తున్నారు. అక్కడ పరీక్షలు అనంతరం ఫలితాలు వచ్చేందుకు మూడు నుంచి నాలుగు వారాలు పడుతోంది. అప్పటివరకు వారిపై చర్యలకు అవకాశం లేదు. నమూనాలు సేకరించిన వెంటనే వారికి శిక్ష పడేలా చేస్తే కొంత వరకు భయం ఉంటుందని, అటువంటి పరిస్థితి లేకపోవడం కూడా ఇబ్బంది అవుతోందని చెబుతున్నారు.

ఆహార పదార్థాల నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

- జీవీబీ నందాజీ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

ఆహార పదార్థాలు విక్రయించేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఆహార పదార్థాలు నాణ్యతలో లోపం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వంట చేసే చోట కూడా పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయించడం నేరం. ఆ విషయం పరీక్షల్లో తేలితే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకుంటాం. నాణ్యత లోపించినా, ఆహార పదార్థాలు కలుషితం అయినట్టు అనిపించినా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు. ఆయా హోటళ్లలో తనిఖీలు నిర్వహించి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రతినెలా మూడు ఆకస్మిక తనిఖీలు పెట్టుకుంటున్నాం. అనుమానం ఉన్న పదార్థాలను ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ఏటా పదుల సంఖ్యలో హోటల్స్‌కు జరిమానాలు విధిస్తున్నాం. అయినా మార్పు రావడం లేదు.

ఏయూ దూర విద్య విద్యార్థుల అగచాట్లు

... 5వ పేజీ తరువాయి

'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి శనివారం ఏయూ వీసీ శశిభూషణరావు దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. టెంప్లేట్ డిజైన్ చేయకపోవడం వల్ల ఇబ్బంది తలెత్తిందని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే అధికారులతో సమీక్షించానని, కొద్దిరోజుల్లోనే డిజైన్ పూర్తిచేసి విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీతోపాటు మార్కుల లిస్టులు అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

పోస్టింగ్‌కు పోటీ

... 5వ పేజీ తరువాయి

పంపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పలువురు తహసీల్దార్లు విశాఖ రావడానికి యత్నిస్తున్నారు. వారితోపాటు జిల్లాల విభజన సమయంలో పాడేరు వెళ్లిన పలువురు తహసీల్దార్లు కూడా విశాఖకు వచ్చేందుకు కలెక్టర్‌ను కలిశారు. మరికొందరు తమకు తెలిసిన ఎమ్మెల్యేల ద్వారా కలెక్టర్‌కు చెప్పించుకుంటున్నారు. ఇదిలావుండగా విశాఖ జిల్లాలో గత వారం పోస్టింగ్స్ ఇచ్చిన వారిలో ముగ్గురు ఇంకా విధుల్లో చేరలేదు. వారం క్రితం చేరిన తహసీల్దారు ఒకరు జూలై నెలాఖరున రిటైరయ్యారు. మరో తహసీల్దారు పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో రెండు ఖాళీలు ఉన్నాయి. ఒకవేళ పోస్టింగ్స్ పొందిన ముగ్గురూ విధుల్లో చేరకపోతే ఖాళీలు ఐదుకు చేరతాయి. ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిన తరువాత అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. అప్పుడే విశాఖలో ఖాళీలను భర్తీ చేస్తారు. ఒకవేళ విశాఖ జిల్లాలో ఏమైనా తహసీల్దార్లను మార్పులు చేస్తారా? అన్నది కూడా కలెక్టర్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.



తుదిమెరుగులు దిద్దుకుంటున్న అన్న క్యాంటీన్

ప్రారంభానికి సిద్ధంగా అన్న క్యాంటీన్

గోపాలపట్నం, ఆగస్టు 3: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మూతపడిన అన్న క్యాంటీన్లు మళ్లీ తెరుచుకోనున్నాయి. గత ఐదేళ్లుగా నిర్వహణ లేక ఈ భవనాలు దుర్భరంగా మారాయి. భవనాల్లో చాలా సామగ్రి చోరీకి గురైంది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో గోపాలపట్నంలోని రైతుబజారు వద్ద బీఆర్‌టీఎస్‌పై ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని ఆధునీకరిస్తున్నారు. ఈ భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేశారు. ఆగస్టు 15న ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నవ వధువు అదృశ్యం

పెందుర్తి, ఆగస్టు 3: ఆషాఢ మాసంలో పుట్టింటికి వచ్చిన నవ వధువు అయిన తమ కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి పెందుర్తి పోలీసులను శనివారం ఫిర్యాదు చేసింది. సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట సంతోష్‌నగర్‌కు చెందిన కుమిలి సీత కుమార్తె శారద (22)కు తుని ప్రాంతానికి చెందిన శేషు వర్మతో గత ఏడాది వివాహమైంది. కాగా గతనెల నాలుగన ఆషాఢం కావడంతో అత్తింటి నుంచి శారద పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం బయటకు వెళ్లిన తమ కుమార్తె తిరిగి ఇంటికి చేరుకోలేదని, ఆమె సెల్‌కు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తుందని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఆదేశాల మేరకు ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్ను వసూలు చేయాలి: జెడ్సీ సన్యాసినాయుడు

గాజువాక, ఆగస్టు 3: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో ఆస్తి పన్నును క్రమం తప్పకుండా వసూలు చేయాలని జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు కోరారు. జోనల్ కార్యాలయంలో సచివాలయం అడ్మిన్‌లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ప్రతి సచివాలయం పరిధిలో ఇంటింటా సర్వే చేసి పన్నులు వసూళ్లు చేయాలని సూచించారు. జీవీఎంసీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రామనారాయణ, ఆర్ఐలు రెడ్డి మోహన్, సుభాన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 3: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, అభివృద్ధే ధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. శనివారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంటును రక్షించుకుంటామన్నారు. ఉక్కు ఉత్పత్తిని పెంచి ప్లాంట్ మరింత అభివృద్ధి చెందేందుకు కార్మికులు కృషి చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యంతో చర్చిస్తామన్నారు. సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, మొల్లి చిన్నోడు, కొల్లి శివనాగేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి

అగనంపూడి, ఆగస్టు 3: గ్రామాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. అగనంపూడి కుమ్మరి వీధిలో శనివారం ఆయన పర్యటించి, స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగు నిలిచిపోతుందని, వీధి లైట్లు వెలగడం లేదని పలువురు కార్పొరేటరుకు వివరించారు. దీంతో ఆయన తక్షణమే వీధి లైట్లను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కరణం జగదీశ్, సింగిడి సింహాచలం, మాడిశ వెంకటరావు, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **కల్కి:** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 26, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 62, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 32, కీరదోస 30, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ములగాడకు కాలుష్యం ముప్పు!

- సమీప చెరువు స్థలంలో డంపింగ్ చేస్తున్న ఓ కంపెనీకి చెందిన వ్యర్థ పౌడర్
- భూగర్భ జలాలు, పర్యావరణానికి హాని జరుగుతుందంటూ గ్రామస్థుల ఆందోళన
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు


చెరువు స్థలంలో వ్యర్థ పౌడర్‌ను వేసి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

మల్కాపురం, ఆగస్టు 3:
ములగాడ గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన వ్యర్థాలతో కూడిన పౌడర్‌ను డంప్ చేసి యథేచ్ఛగా మట్టితో కప్పేస్తున్నారు. ఇది భూమిలోకి చేరడంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు కలుషితమవ్వడంతో పాటు పరిసరాల్లోని చెట్లు కూడా బతకవని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణం నాశనమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పౌడర్‌ను తాకిన చోట శరీరం దురదతో పాటు మంటగా ఉంటోందని పలువురు పేర్కొంటున్నారు. అటువంటి పౌడర్‌ను ఏకంగా చెరువులో డంప్ చేస్తుండడం దారుణమని వాపోతున్నారు. ఒడిశా ప్రాంతం నుంచి ఈ కంపెనీకి ట్యాంకుల నుంచి తీసుకువస్తున్న ఈ పౌడర్‌తో వివిధ ఉత్పత్తులను తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిసింది. ఉత్పత్తులు తయారయ్యాక మిగిలిన వ్యర్థ పౌడర్‌ను కింద పడకుండా రెండు మూడు టార్పాన్లతో కప్పి జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో డంప్ చేయాలి. కానీ సదరు కాంట్రాక్టర్ ములగాడకు సమీపంలో ఉన్న పోర్టు స్థలంలో పడేస్తున్నారు. తమ గ్రామానికి సమీపంలో ఈ పౌడర్‌ను డంప్ చేస్తున్నందున భవిష్యత్తులో తమకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే తమ గ్రామం జింక్ కాలుష్యంతో నాశనమైందని, ఎంతోమంది అంగవైకరులుగా మారారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ప్రైవేటు కంపెనీ వ్యర్థాలను ఇష్టానుసారంగా డంపింగ్ చేస్తున్నందున భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులకు గురవుతామోనని ఆవేదన చెందుతున్నారు. ఇవన్నీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టవలసిందిగా వారు కోరుతున్నారు.


58వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కాలుష్యం నుంచి కాపాడాలంటూ గణబాబుకు వేడుకోలు

కాలుష్యం నుంచి తమను కాపాడాలంటూ పలు గ్రామాల ప్రజలు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు విజ్ఞప్తి చేశారు. శనివారం 58వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అల్లు ఫ్లోరైడ్ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తాము రోగాల బారినపడుతున్నామని, ములగాడ, ఎదరువానిపాలెం, గొందేశివానిపాలెం, తదితర ప్రాంతాలపై కాలుష్య ప్రభావం అధికంగా ఉంటుందని ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే ఎదరువానిపాలెంలో గెడ్డను ఏర్పాటు చేయాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలని కోరారు. అందుకు స్పందించిన స్పందించిన గణబాబు త్వరలో కాలుష్య సమస్యతో పాటు మిగిలిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, జనసేన 'పశ్చిమ' సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, నాయకులు సన్యాసిరావు అనిల్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, ఆగస్టు 3: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,269వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును పూర్తి స్థాయిలో నడిపేందుకు ముడిసరకును ఎలాంటి అంతరాయాలు లేకుండా సక్రమంగా సరఫరా అయ్యేలా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన అమరావతి, పోలవరం నిర్మాణాల్లో విశాఖ స్టీల్ వినియోగంపై తగిన నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. నాయకుడు ఎన్.రామారావు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. వర్కింగ్ క్యాపిటల్ లేనందున ముడిసరకు కొనుగోలు చేయక ఉక్కు ఉత్పత్తి పూర్తిగా అడుగంటిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు ముడిసరకు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాస్, నీలకంఠం, దేముడునాయుడు, కృష్ణమూర్తి, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్


పలు విద్యుత్ స్తంభాల వద్ద కొత్త ఫ్యూజు బాక్సులు, ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసి దృశ్యం

కొత్త ఫ్యూజు బాక్సులు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదగంట్యాడ, ఆగస్టు 3: పెదగంట్యాడ పారిశ్రామికవాడలో పలుచోట్ల పాడైపోయిన ఫ్యూజు బాక్సుల స్థానంలో కొత్తవాటిని సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. పారిశ్రామికవాడ ప్రధాన రహదారిలో, యాతపాలెం నుంచి పెదగంట్యాడ వెళ్లే రోడ్డులో మరమ్మతులకు గురైన కొన్ని ఫ్యూజు బాక్సులను పూర్తిగా తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. డోర్ లేని ఫ్యూజు బాక్సులకు ఐరన్ గ్రిల్స్‌ను బిగించారు. ఏపీఈపీడీసీఎల్ పెదగంట్యాడ సబ్ స్టేషన్ సిబ్బంది రెండు రోజుల పాటు ఆయా పనులను పూర్తి చేశారు. పారిశ్రామికవాడలో పలు ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా మారాయంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టారు. సమస్యను పరిష్కరించిన సబ్ స్టేషన్ అధికారులకు స్థానికులు, పారిశ్రామికవాడకు చెందిన పలువురు కార్మికులు అభినందనలు తెలిపారు.

తల్లి పాలే పిల్లలకు ఎంతో ఆరోగ్యకరం

పెదగంట్యాడ, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డలకు ఎంతో ఆరోగ్యకరం, పౌష్టికాహారం అని నినాదాలు చేస్తూ శనివారం సిద్ధేశ్వరం నిర్వాసిత కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని చేపట్టారు. సిద్ధేశ్వరం-1, 2లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు జి.వెంకటలక్ష్మి, టి.రేవతిల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వియ్యపువానిపాలెం, గొంతెనవానిపాలెం, అంబేడ్కర్ కాలనీలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు విజయకుమారి, ఉమామహేశ్వరి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అపోహలను వీడి తమ పిల్లలకు తల్లి పాలు అందిస్తే వారు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని, తల్లిపాలే పౌష్టికాహారమన్న వాస్తవాన్ని బాలింతలు గుర్తించాలని ప్రముఖ వైద్యురాలు అనుషా తురాగ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పలు అంశాలను వివరించారు. ప్రసవానంతరం పిల్లల సంరక్షణపై తల్లి పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని ఆచరించాలని కోరారు. పలువురు వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వారోత్సవాల్లో భాగంగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, ఎం.రాము, అంగన్‌వాడీ కార్యకర్త పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.


సిద్ధేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మల్కాపురం: గ్రేటర్ 58వ వార్డు ములగాడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. చిన్నారులకు అంగన్‌వాడీలకు క్రమం తప్పకుండా పంపించాలని కోరారు.

ఎయిర్‌పోర్టులో మంత్రులకు స్వాగతం

గోపాలపట్నం, ఆగస్టు 3: పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులు, అనకాపల్లి ఎంపీకి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం ఉదయం పది గంటలకు గన్నవరం నుంచి ఇండిగో విమానంలో విశాఖ చేరుకున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు, మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు, అనకాపల్లి సీఎం రమేశ్‌కు అభిమానులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనిత నగరంలోని తన నివాసానికి వెళ్లగా, మంత్రి నారాయణ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లారు. ఎంపీ సీఎం రమేశ్ అనకాపల్లి పయనమయ్యారు.


విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని కోరుతూ అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించిన పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

'ఎస్సీ వర్గీకరణను నిజాయితీగా చేపట్టాలి'


ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను నిజాయితీగా చేపట్టాలని మాల మహానాడు స్టీల్‌ప్లాంట్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శనివారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక వెనకబాటుతనాన్ని గుర్తించి జనాభా నిష్పత్తి ప్రకారం అందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బయ్యే మల్లయ్య, మాటూరి శ్రీనివాసరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో పాటు సమాన హక్కులు కల్పించాలి

సింధియా, ఆగస్టు 3: సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణపై ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే ఇందులోని 59 ఉప కులాలకు సంబంధించి రాజ్యాంగ హక్కులను సమానంగానే అందించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు డిమాండ్ చేశారు. 63వ వార్డు పరిధి కాకరలోవలో దళితుల హక్కులపై శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా రిజర్వేషన్ల జోలికి వెళ్లలేని ప్రభుత్వాలు ఇప్పుడు వర్గీకరణకు సిద్ధం కావడం సరికాదని ఆ వేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కామేశ్వరరావు, వైకనకరాజు, రంగాల అప్పారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో మహిళకు తీవ్ర గాయాలు

పెందుర్తి, ఆగస్టు 3: మండలంలోని చింతగట్ల పంచాయతీ పరిధి ఇప్పిలివానిపాలెంలో ఇరు వర్గాల మధ్య జరిగిన భూ వివాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలవ్వడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇప్పిలివానిపాలెంలో మాడిస కన్నమ్మకు, మాడిస వెంకునాయుడు కుమారులు రమణ, పైడిరాజు కుటుంబాల మధ్య కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం వెంకునాయుడు కుటుంబానికి చెందిన ఉపమాక గణేశ్, దేవుడమ్మ, శ్యామ్, గణేశ్‌లు వివాదంలో ఉన్న భూమిని ట్రాక్టర్‌తో దున్నేందుకు ప్రయత్నించగా కన్నమ్మ అడ్డుకుంది. ఆగ్రహించిన వారు కర్రలతో కన్నమ్మపై దాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కన్నమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే ఆమెను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మావతినగర్‌లో చురుగ్గా వాకింగ్ ట్రాక్ నిర్మాణం

వేపగుంట ఆగస్టు 3: గ్రేటర్ 98వ వార్డులో పద్మావతినగర్ కాలనీ శివారు నున్న కొండ చుట్టూ ఎట్టకేలకు వాకింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. కొండచుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు 20 లక్షల రూపాయలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. దీనిని దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు సిద్ధమవ్వగా.. కొంతమంది అడ్డుకున్నారు. దీంతో కొన్నాళ్లుగా పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ సమస్యను పలువురు స్థానికులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన వచ్చి సదరు స్థలాన్ని పరిశీలించడంతో పాటు వెంటనే అధికారులుకు ఆదేశాలు జారీ చేయడంతో ఎట్టకేలకు పనులు చేపట్టేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కొండచుట్టూ ఉన్న కొన్ని శిథిలాలలను తొలగించి గ్రావెల్‌తో చదును చేసే కార్యక్రమం జరుగుతోంది. ట్రాక్‌తో పాటు జిమ్ సామగ్రి ఏర్పాటు చేయనున్నట్టు డీఈ విజయకుమార్ పేర్కొన్నారు.



శివయ్యకు ఆషాఢ చతుర్దశి పూజలు

అగనంపూడి, ఆగస్టు 3: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి కర్ణవానిపాలెంలో గల స్వయంభు లింగాల తిరుగుడు ఆలయంలో ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు.

ఎనభై అడుగుల రోడ్డులో ఆక్రమణల తొలగింపు


రోడ్డు మధ్యలోని ఇళ్ల నిర్మాణ సామగ్రిని తొలగిస్తున్న పోలీసులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 3: తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో ఆ క్రమణలను నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం తొలగించారు. క్రేన్ సహాయంతో కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను తొలగించారు. మరోసారి రోడ్డు పైగానీ, ఫుట్‌పాత్‌పై గానీ వాహనాలను పార్కింగ్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే, రోడ్డుకు అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రిని తొలగించడంతో పాదచారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి. వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

కెమికల్ కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు

కంచరపాలెం, ఆగస్టు 3 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విశాఖ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణతో పాటు పలువురు అధ్యాపకులు, 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ రక్తదానం ఆపదలో మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ బ్లడ్ బ్యాంకు ప్రాజెక్టు డైరెక్టర్ డి.రామ్ రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలంటూ వినతి


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి వినతి పత్రమిస్తున్న బాధితుడు, గ్రామపెద్దలు

సీతమ్మధార, ఆగస్టు 3: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలో నివాసముంటున్న నక్క రాజశేఖర్‌రెడ్డి.. తన ఇంటి పక్కనున్న భీశెట్టి కుమార్‌బాబు, అతని సోదరి మాధవి చాలాకాలంగా తమ కుటుంబాన్ని వేధింపులకు గురిస్తున్నారని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. తన ఇంట్లోని కుటుంబ సభ్యులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు రోజులుగా తన ఇంటి ప్రహరీని పగులగొట్టి, బెదిరింపులకు పాల్పడుతున్నట్టు రాజశేఖరరెడ్డి ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సీఐతో ఫోనులో మాట్లాడి కుమార్‌బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నక్కవానిపాలెం గ్రామ కమిటీ పెద్దలు, దొడ్డి పెద్దలు కూడా ఎమ్మెల్యేకు కుమార్‌బాబు తీరుపై ఫిర్యాదు చేశారు. రోడ్డుపై వెళ్తున్న మహిళలకు అసభ్యకరంగా సైగలు చేస్తున్న వీడియోలను చూపించారు.

మధ్యాహ్న భోజనాలు సక్రమంగా అందించాలి

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జగదాంబ కూడలి, ఆగస్టు 3: పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకంను సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ వన్‌టౌన్ పాతపోస్టాఫీసు వద్దనున్న జీవీఎంసీ పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనాలను స్వయంగా రుచిచూసి నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. చిన్నారుల్లోవిద్యాప్రమాణాలను పెంచేలా బోధించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రభుత్వపరంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫారం, బ్యాగులు చిన్నారులకు అందాయా..లేదా అని ఆరా తీశారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో టాయిలెట్స్ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇబ్బందులుంటే విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలమని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.


పాతపోస్టాఫీసు వద్ద జీవీఎంసీ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం రుచి చూస్తున్న కలెక్టర్

తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్


బాలింతకు పోషకాహార కిట్ అందిస్తున్న కలెక్టర్, వైద్యులు

జగదాంబ కూడలి, ఆగస్టు 3: బిడ్డకు తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు.శనివారం ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలో భాగంగా ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని మహిళా శిశు సంక్షేమశాఖ ఉద్యోగులను ఆదేశించారు. పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువు మెదడు చురుగ్గాపనిచేస్తుందన్నారు. తల్లులకు బ్రెస్ట్, అండాశయ క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. అనంతరం బాలింతలకు పోషకాహార కిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్, ఆర్ఎంవో పి.రాధారాణి, ఎస్ఎన్ఈయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి. బిందుమాధవి, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి జయదేవి, పిల్లల వైద్య నిపుణులు చంద్రశేఖర్, ప్రవీణ, గౌతమి, అంగన్‌వాడీ ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి ఉద్యోగులు విజయకుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌కు ఉద్యోగ విరమణ వీడ్కోలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 3: ఉద్యోగ విరమణ చేసిన జీవీఎంసీ మాజీ చీఫ్ ఇంజనీర్ పి. రవికృష్ణరాజును ఘనంగా సన్మానించారు. జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వీడ్కోలు సభకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడారు. రవికృష్ణరాజు సేవలు మరువలేనివని కొనియాడారు. అతనిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ సభకు జీవీఎంసీ ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ ఎం.వినయ్‌కుమార్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. సన్మానగ్రహీత రవికృష్ణ రాజు మాట్లాడుతూ సభ్యులకు, తనకు సహాయసహకారాలు అందించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎస్ఈ కేవీఎన్ రవి, చైర్మన్ జగన్నాథం, కన్వీనర్ రాజాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి రంధిసాధురావు, పి.ఎస్.ప్రసాద్, రాజు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ పలాస చేరే వేళలు సవరింపు

విశాఖపట్నం, ఆగస్టు 3: విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే 18526 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు పలాస స్టేషన్ చేరే సమయాన్ని సవరించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈ రైలు మధ్యాహ్నం 3.00 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.43 గంటలకు పలాస చేరి, తిరిగి అక్కడ నుంచి 6.48 గంటలకు బయలుదేరే విధంగా మార్పు చేసినట్టు పేర్కొన్నారు. సవరించిన వేళలు ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. అలాగే గుణుపూర్ నుంచి సంబల్‌పూర్ సిటీ వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18118) రైలు పలాస నుంచి పలు స్టేషన్లకు చేరే వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్టు వివరించారు.

'తుపాకీ సంస్కృతితో మానవ మనుగడకు ముప్పు'

సీతమ్మధార, ఆగస్టు 3: తుపాకీ సంస్కృతితో మానవ మనుగడకు వినాశమని వక్తలు ఆందోళన వ్యక్తంచేశారు. బుల్లయ్య కళాశాలలో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో 'తుపాకీ సంస్కృతి' అనే అంశంపై సదస్సును సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహిచారు. ముఖ్య వక్తలు ఆచార్య బాలమోహన్‌దాస్, ఆచార్య కె. రవి, ఆచార్య పద్దయ్య, డాక్టర్ కేవీఎస్ఎం మూర్తి మాట్లాడుతూ అగ్ర రాజ్యం అమెరికాలో తుపాకీ సంస్కృతి పెరుగుతుండడం విచారకరన్నారు. ఇటీవల ఆ దేశ మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై జరిగిన తుపాకీ కాల్పులను అందరూ ఖండించాలన్నారు. భారత దేశంలోనూ హింసకు అనేక మంది నాయకులను కోల్పోయామన్నారు. ప్రపంచ శాంతి కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో బ్రహ్మకుమారీ రమ, మహ్మద్ మున్నార్, బి.చిన్నారావు, హుస్సేన్, దాట్ల బాబూరావు రెడ్డి, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఇండియన్ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

సీతంపేట, ఆగస్టు 3: ఇండియన్ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా స్థానిక ద్వారకానగర్ జోనల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్యాంకు జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్వే ప్రారంభించారు. స్థానిక మేనేజర్లు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్వే మాట్లాడుతూ బ్యాంక్, జోనల్ ఆఫీసు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ కోసం మొక్కలు నాటడం, ఇతర సీఎస్ఆర్ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. సామాజిక ప్రయోజన కార్యక్రమాల్లో తమ బ్యాంకు ఎల్లప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని సిబ్బందికి, వారి పిల్లల కోసం వివిధ రకాల పోటీలు, సాస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'అవయవ దానానికి ముందుకు రావాలి'


మాట్లాడుతున్న సంఘం చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి

సీతంపేట,ఆగస్టు 3: అవయవ దానానికి స్వచ్ఛందంగా అందరూ ముందుకు రావాలని కేజీహెచ్ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ శివానంద పేర్కొన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని శనివారం అఖిల భారత అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ శివానంద మాట్లాడుతూ మరణం తర్వాత కూడా జీవించాలంటే అవయవ దానం చేయాలని కోరారు. అవయవదానం వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఏఎంసీ అనాటమీ విభాగ అధిపతి రవీంద్ర కిశోర్ మాట్లాడుతూ అవయవ దానం వైద్య విద్యార్థులకు ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. అఖిల భారత అవయవ దాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరి సీతా మహాలక్ష్మీ మాట్లాడుతూ జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో అవయవ దానంకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోబ్రహ్మ కుమారీస్ ప్రతినిధి రామేశ్వరి, రక్తదానం ఉద్యమకర్త వినోద్‌బాలు, సీఐఎస్ఎఫ్ అధికారి డాక్టర్ ఎస్. కురణరాజు, సీనియర్ సిటిజన్ ఫణి, ఏఎంసీ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, సంస్థ కార్యదర్శి ఎస్.బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భళ్లమూడి'కి అంగర సూర్యారావు పురస్కారం


భళ్లమూడి రామమూర్తికి పురస్కారమందిస్తున్న అతిథులు

సీతంపేట, ఆగస్టు 3: ప్రముఖ నాటక రచయిత, కథకుడు అంగర సూర్యారావు జీవన సాఫల్య పురస్కారాన్ని నాటక ప్రదర్శనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న భళ్లమూడి రామమూర్తికి అందజేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపకులు, కథకుడు అంగర సూర్యారావు 97వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు జీవన సాఫల్య పురస్కారం రామమూర్తికి అందించారు. నగదుతోపాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అతిథులు అందచేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకర్ మాట్లాడుతూ అంగర సూర్యారావు గొప్ప కథకులని కొనియాడారు. సాహితీవేత్త పురిపండా అప్పలస్వామి చరిత్ర, అంగర సూర్యారావు రాసిన డైరీని పుస్తక రూపం తేవడానికి కృషి చేసిన అంగర కృష్ణారావు, అంగర వెంకట్‌కు అభినందనలు తెలిపారు. ఈ సభకు అడపా రామకృష్ణ అధ్యక్షత వహించారు. బాదంగిరి సాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపకులు, నటులు పి.వి. మాధవ్ నాటక ప్రయోక్త సత్కారం అందుకున్నారు. పురిపండా పుస్తకాన్ని డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, సూసర్ల సర్వేశ్వరరావు, శిరేల సన్యాసిరావు, ఎం.పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జువైనల్ హోంకు బాలుడి తరలింపు

సీతంపేట, ఆగస్టు 3: బాలికను మోసగించిన కేసులో మైనర్ యువకుడిని నాలుగో పట్టణ పోలీసులు జువైనల్ హోమ్‌కి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వే న్యూకాలనీ ప్రాంతానికి చెందిన బాలికను పదోతరగతి చదువుతున్న సమయంలో ఆ బాలుడు పరిచయం చేసుకున్నాడు. మోసపూరితమైన మాటలతో ఆ బాలికను ఇంట్లో ఎవరు లేని సమయంలో లోబరుచుకున్నాడు. కొద్దినెలలకు బాలిక గర్భవతి అయినట్టు ఆమె తల్లి గుర్తించారు. చికిత్స కోసం ఆమెను కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా.. ఆసుపత్రి వర్గాలు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పాటు బాలిక తల్లి కూడా ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు కావడంతో ఏసీపీ విచారణ చేపట్టి నిందితుడిని జువైనల్ హోమ్‌కి తరలించారు.

కేజీహెచ్‌కు వాషింగ్ మెషిన్ వితరణ

మహారాణిపేట, ఆగస్టు 3: కేజీహెచ్‌లో నవజాతి శిశువుల వైద్య విభాగానికి విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థ హైటెక్ వాషింగ్ మెషిన్ వితరణగా అందించింది. శనివారం సంస్థ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు ఈ మెషిన్‌ను అందించారు. ఆస్పత్రి వర్గాల అభ్యర్థన మేరకు నవజాత శిశువుల దుస్తులు, డైపర్లు శుభ్రపరించేందుకు దీనిని అందించినట్టు చెప్పారు. వైద్యులు సత్యవాణి, పద్మావతి, సందీప్ పాల్గొన్నారు.

14 స్కూలు బస్సులు, ఆటోపై ఆర్టీఏ కేసులు

మురళీనగర్, ఆగస్టు 3 ; విశాఖపట్నం ఆర్టీఏ కార్యాలయ పరిధిలో 14 స్కూలు బస్సులు, ఒక ఆటోపై ఆర్టీఏ అధికారులు శనివారం కేసులు నమోదు చేశారు. కైలాసపురం, తాటిచెట్లపాలెం, బీచ్ రోడ్డు పరిధిలో జరిపిన తనిఖీల్లో ఈ కేసులు నమోదు చేసినట్టు డీటీసీ జి.సి.రాజారత్నం తెలిపారు. అలాగే, జూన్ 13వ తేదీ నుంచి 74 కేసులు నమోదు చేసి, 8 బస్సులు సీజ్ చేసినట్టు వివరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మాధవి, మస్మేహన్, బాలాజీ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

మహారాణిపేట, ఆగస్టు 3: జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఎం ఎన్ హరేం.దిర ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్లు శనివారం కలెక్టరేట్‌లో వినతి ప త్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు గంట్ల శ్రీనుబాబు, పోతుమహంతి నారాయణ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులం దరికీ రూ. 1250 చొప్పున ఆరోగ్య బీమా చెల్లించాలని, పిల్లల స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి మెడిక్లెయిమ్ చె ల్లింపులపై తగిన చర్యలుతీసుకుంటామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఈరోతి ఈశ్వరావు డి. రవికుమార్, ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కైలాసగిరి

... 5వ పేజీ తరువాయి

తాగునీరు, విద్యుద్దీకరణ వంటిమౌలిక వసతులు వీలైనంత త్వరగా కల్పిస్తామన్నారు.

చెరువులకు కొత్తరూపు

నగరం, పరిసర ప్రాంతాల్లో 520 వరకు చెరువులు ఉన్నాయని, అయితే చాలా వాటిలో నీరు లేదని, ఎండిపోయి మట్టితో పూడుకుపోయాయని, అటువంటివి ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని కాపాడేందుకు జీవీఎంసీతో కలిసి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అవి మళ్లీ నీటితో కళకళలాడేలా, జన సందర్శనకు వీలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ తరహా పనులు కొన్ని స్వచ్ఛంద సంస్థలు చేస్తున్నాయని, వాటి సాయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఆక్రమణలకు గురైన, నిర్మాణాలు జరిగిన చెరువుల జోలికి వెళ్లబోమన్నారు. వర్షం పడితే చెన్నై, బెంగళూరు వంటి నగరాలు నీటిలో మునిగిపోతున్నాయని, విశాఖపట్నానికి అటువంటి సమస్య రాకుండా ఉండేందుకు ముందుచూపుతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

ఐటీ పార్కులో నాలుగు టవర్లు

మారికవలసలో హరిత ప్రాజెక్టు సమీపాన వీఎంఆర్‌డీఏకు 20 ఎకరాల వరకు ఉందని, అందులో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించి పనులు ఆపేశారని, దానిని మళ్లీ ఇప్పుడు పునరుద్ధరణ చేయబోతున్నామన్నారు. ఐటీ సంస్థలకు ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో ఇచ్చేలా నాలుగు టవర్లు నిర్మించాలని యోచిస్తున్నామన్నారు. ఒక టవర్‌లో 31 అంతస్థులు నిర్మించాలనే ఆలోచన ఉందన్నారు. అక్కడే కమర్షియల్ కాంప్లెక్స్‌లు, రెసిడెన్షియల్ ఏరియా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించాల్సి ఉందన్నారు.

అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్

మధురవాడలో అందుబాటులో ఉన్న స్థలంలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. యువతను ఎక్కువగా ఆకట్టుకుంటున్న ఆగ్మెంటెడ్ రియాల్టీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడా వినోదం అందిస్తామన్నారు. ఇది సాధారణ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్లకు భిన్నంగా ఉంటుందన్నారు.

- ఎన్ఏడీ జంక్షన్‌లో ఆర్ఓబీతో పాటు సబ్ వే కూడా నిర్మించాలని కోరుతున్నారని, త్వరలో ఆ పనులు కూడా చేపడతామన్నారు. చీమలాపల్లి, ఎండాడల్లో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్లు, మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామని చెప్పారు.

అందరితో చర్చించి మాస్టర్ ప్లాన్ రహదారులు

ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ రెండు మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నదని, ఇంకా ఎక్కడెక్కడ అవసరమో ఏపీఐఐసీ, టూరిజం, నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అన్నింటికి ఆన్‌లైన్ పేమెంట్

వీఎంఆర్‌డీఏకు వాణిజ్య సముదాయాలు, కళ్యాణ మండపాలు, చిల్డ్రన్ ఎరీనా, పార్కులు, మ్యూజియాలు ఉన్నాయని, వీటన్నింటినీ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. సంస్థ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదని ఆలోచించి ప్రాధాన్యం ప్రకారం పనులు చేపడతామన్నారు.

సిబ్బంది భర్తీకి చర్యలు

సంస్థలో సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని, దాంతో పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పనులు ఏమీ జరగడం లేదని వివరించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, డ్రాఫ్ట్‌మెన్లు, వీఆర్ఓ పోస్టులు వంటివి భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఐటీ సెల్‌ను బలోపేతం చేసి, వెబ్‌సైట్‌ను మరింత జనరంజకంగా మార్చి, సోషల్ మీడియాలో కూడా వీఎంఆర్‌డీఏ ఉండేలా చేస్తామన్నారు.

రూ.4 కోట్లు స్వాహా కేసులో నిందితుడి కోసం గాలింపు

ముమ్మరంగా దర్యాప్తు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పనిచేస్తున్నాడని సంస్థ అకౌంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.4 కోట్లు స్వాహా చేసి పరారైన ప్రబుద్ధుడి కోసం ఎంవీపీ పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన సీహెచ్ రాధాకృష్ణమూర్తి (80) ఇరవై ఏళ్ల కిందట విశాఖలో స్టోన్‌క్రషర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. తన వ్యాపారానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఆడిట్ వ్యవహారాలు చూసేందుకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని తంగేడుకు చెందిన చిటికెల గోవింద్‌ను 2010లో అకౌంటెంట్‌గా తీసుకున్నారు. రాధాకృష్ణమూర్తి అనారోగ్యం బారినపడడంతో 2016లో తన స్వస్థలానికి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన కుమార్తె ద్వారా కొంతకాలంపాటు వ్యాపారం నడిపించారు. అయితే ఆమె నగరానికి రావడం సాధ్యం కాకపోవడంతో స్టోన్ క్రషర్‌ను నాలుగు కోట్ల రూపాయలకు విక్రయించారు. ఆ సొమ్మును తన ఖాతాలో డిపాజిట్ చేసుకున్నారు. అయితే ఫోర్జరీ సంతకాలు, తప్పుడు డాక్యుమెంట్లతో రాధాకృష్ణమూర్తి ఖాతాలోని దాదాపు నాలుగు కోట్ల రూపాయలను అకౌంటెంట్ గోవింద్ తన ఖాతాలకు మళ్లించుకున్నాడు. దీనిపై రాధాకృష్ణమూర్తి ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గోవింద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో రాధాకృష్ణమూర్తి జూన్ 12న అప్పటి సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిశారు. అలాగే ఇటీవల ఆయన అల్లుడు అప్పయ్య చౌదరి ప్రస్తుత పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సీపీ వెంటనే ఎంవీపీ సీఐ సంజీవరావుకు ఫోన్ చేసి కేసు దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నిందితుడి ఆచూకీ తెలుసుకునేందుకు వారి కుటుంబ సభ్యుల సెల్ ఫోన్ కాల్ డేటా, నిందితుడి బ్యాంకు ఖాతాలు పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు సీఐ సంజీవరావు శుక్రవారం సీతమ్మధారలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు వెళ్లి బాధితుడి బ్యాంకు ఖాతాతో పాటు నిందితుడి గోవింద్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. తదుపరి దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఐ సంజీవరావు తెలిపారు.

మెట్రో రైలుకు మరో అడ్డంకి

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున, ఆ ఫ్లైఓవర్లు, మెట్రో రైలు స్టేషన్లను ఇంటిగ్రేట్ చేస్తూ కొత్త ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల విశాఖపట్నం వచ్చినప్పుడు మెట్రో రైలు అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ల నిర్మాణం మంచిదా?, ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే మంచిదా? ఆలోచించి తనకు చెప్పాలని కోరారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇబ్బంది లేకుండా మార్పులు చేయాలని సూచించారు. అంటే కేంద్రం కోరిన మొబిలిటీ ప్లాన్ కూడా ఇందులో కీలకం కానుంది. నగరంలో బీఆర్‌టీఎస్ రహదారులు, వాహనాల సంఖ్య, ఏయే జంక్షన్లలో ఎంతెంత ట్రాఫిక్ ఉంటున్నదీ కొత్తగా అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా మెట్రో రైళ్ల సంఖ్య, వాటికి బస్సుల అనుసంధానం వంటివి సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ పరిశీలించాకే కేంద్రం నుంచి ఆమోదం లభిస్తుంది. అప్పుడు పీపీపీలో చేయడానికి ఎవరు ముందుకు వస్తారనేది తేలుతుంది. ఆ తరువాతే ప్రాజెక్టు ముందుకు వెళుతుంది.

ప్రజారోగ్యానికి పొగ

... 5వ పేజీ తరువాయి

భద్రతా ప్రమాణాలు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అనేకసార్లు ఈ విషయం రుజువయ్యింది. ముందురోజు మిగిలిన పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టి మరుసటిరోజు వేడి చేసి విక్రయించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఒకసారి వేడి చేసిన నూనెను...ఆ తరువాత మళ్లీ మళ్లీ వినియోగించడం చాలా ప్రమాదకరమంటున్నారు. సాధారణంగా ఒక్కసారి కూడా వినియోగించని నూనెలో టీపీసీ (టోటల్ పోలార్ కాంపౌండ్) వాల్యూ ఆరు శాతం ఉంటుంది. రెండుసార్లు నూనెను వేడి చేస్తే 20 నుంచి 25 శాతానికి ఈ విలువ పెరుగుతుంది. అది 25 శాతానికి మించితే ఆరోగ్యానికి హానికరంగా భావించాల్సి ఉంటుంది. అయితే, పదేపదే నూనె వేడి చేసి, అందులోనే ముందురోజు మిగిలిన ఆహార పదార్థాలను వేడి చేసి విక్రయిస్తుంటారు. ఇది ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా వైద్యులు చెబుతున్నారు. దీనివల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలు వేధిస్తాయి. అలాగే, దీర్ఘకాలంలో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నియంత్రణ ఏదీ..?

జిల్లాలో ఆహార పదార్థాల విక్రయాలపై అధికారుల నియంత్రణ లేకపోవడం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణమవుతోంది. ఆహార భద్రతా, ప్రమాణాలు అధికారులు నిరంతరం పర్యవేక్షించడం ద్వారా మాత్రమే ఈ తరహా వాటికి అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే, ఆ శాఖలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తగినంతమంది లేకపోవడం సమస్యగా మారింది. జిల్లాలో ముగ్గురే ఇన్‌స్పెక్టర్లు ఉండడం వల్ల విస్తృతంగా తనిఖీలు చేయలేకపోతున్నట్టు చెబుతున్నారు. సాధారణంగా లక్ష జనాభాకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. కానీ, జిల్లాలోని 25 లక్షల జనాభాకు ముగ్గురే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. దీంతో విస్తృతంగా తనిఖీలు చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఇది కూడా వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించేందుకు కారణమవుతోంది.

తెలంగాణలో ల్యాబ్..

అధికారులు తనిఖీలకు వెళ్లిన సందర్భంగా సేకరించిన నమూనాలను పరీక్షించిన తరువాత గానీ శిక్ష విధించేందుకు అవకాశం లేదు. అయితే జిల్లాలోనే కాదు...రాష్ట్రంలో కూడా ఆహార పదార్థాలను తనిఖీ చేసే ల్యాబ్ లేదు. తెలంగాణలోని హైదరాబాద్‌లో ల్యాబ్ ఉండడంతో అక్కడికే నమూనాలను పంపిస్తున్నారు. అక్కడ పరీక్షలు అనంతరం ఫలితాలు వచ్చేందుకు మూడు నుంచి నాలుగు వారాలు పడుతోంది. అప్పటివరకు వారిపై చర్యలకు అవకాశం లేదు. నమూనాలు సేకరించిన వెంటనే వారికి శిక్ష పడేలా చేస్తే కొంత వరకు భయం ఉంటుందని, అటువంటి పరిస్థితి లేకపోవడం కూడా ఇబ్బంది అవుతోందని చెబుతున్నారు.

ఆహార పదార్థాల నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

- జీఏబీ నందాజీ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

ఆహార పదార్థాలు విక్రయించేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ఆహార పదార్థాలు నాణ్యతలో లోపం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వంట చేసే చోట కూడా పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయించడం నేరం. ఆ విషయం పరీక్షల్లో తేలితే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకుంటాం. నాణ్యత లోపించినా, ఆహార పదార్థాలు కలుషితం అయినట్టు అనిపించినా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు. ఆయా హోటళ్లలో తనిఖీలు నిర్వహించి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రతినెలా మూడు ఆకస్మిక తనిఖీలు పెట్టుకుంటున్నాం. అనుమానం ఉన్న పదార్థాలను ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ఏటా పదుల సంఖ్యలో హోటల్స్‌కు జరిమానాలు విధిస్తున్నాం. అయినా మార్పు రావడం లేదు.

ఏయూ దూర విద్య విద్యార్థుల అగచాట్లు

... 5వ పేజీ తరువాయి

'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి శనివారం ఏయూ వీసీ శశిభూషణరావు దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. టెంప్లేట్ డిజైన్ చేయకపోవడం వల్ల ఇబ్బంది తలెత్తిందని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే అధికారులతో సమీక్షించానని, కొద్దిరోజుల్లోనే డిజైన్ పూర్తిచేసి విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీతోపాటు మార్కుల లిస్టులు అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

పోస్టింగ్‌కు పోటీ

... 5వ పేజీ తరువాయి

పంపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పలువురు తహసీల్దార్లు విశాఖ రావడానికి యత్నిస్తున్నారు. వారితోపాటు జిల్లాల విభజన సమయంలో పాడేరు వెళ్లిన పలువురు తహసీల్దార్లు కూడా విశాఖకు వచ్చేందుకు కలెక్టర్‌ను కలిశారు. మరికొందరు తమకు తెలిసిన ఎమ్మెల్యేల ద్వారా కలెక్టర్‌కు చెప్పించుకుంటున్నారు. ఇదిలావుండగా విశాఖ జిల్లాలో గత వారం పోస్టింగ్స్ ఇచ్చిన వారిలో ముగ్గురు ఇంకా విధుల్లో చేరలేదు. వారం క్రితం చేరిన తహసీల్దారు ఒకరు జూలై నెలాఖరున రిటైరయ్యారు. మరో తహసీల్దారు పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో రెండు ఖాళీలు ఉన్నాయి. ఒకవేళ పోస్టింగ్స్ పొందిన ముగ్గురూ విధుల్లో చేరకపోతే ఖాళీలు ఐదుకు చేరతాయి. ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిన తరువాత అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. అప్పుడే విశాఖలో ఖాళీలను భర్తీచేస్తారు. ఒకవేళ విశాఖ జిల్లాలో ఏమైనా తహసీల్దార్లను మార్పులు చేస్తారా? అన్నది కూడా కలెక్టర్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

నేడు కళాభారతిలో నాటకాల ప్రదర్శన

మద్దిలపాలెం, ఆగస్టు 3 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రామాంజనేయ యుద్ధం, హరిశ్చంద్రుడు అమ్మకం నాటకాలు ప్రదర్శించనున్నట్టు విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకుడు వంకాయల మారుతీ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ అసోసియేషన్ 20వ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన



సింహాచలం, ఆగస్టు 3 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం సహస్ర తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామాలు పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున తులసీ దళాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఆగస్టు 3 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి పార్వతీపురం పట్టణానికి చెందిన మువ్వల సాయిరామకృష్ణ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం రూ.1,00,352లను నగదు రూపంలో ఆలయ ఏఈఓ నక్క ఆనందకుమార్‌కు శనివారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబీకులకు అంతరాలయంలో స్వామి దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ఆనందపురం, ఆగస్టు 3 : మండలంలోని వేములవలస, బిపివి కళ్లాలు, ఆనందపురం పంచాయతీల్లో పశుగణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా శనివారం గర్భకోశ చికిత్స శిబిరాలు నిర్వహించారు. సుమారు 200 పశువులకు వైద్యులు పరీక్షలు చేసి, పెంపకందారులకు మందులు అందజేశారు. అలాగే 30 లేగ దూడలకు నట్టల నివారణ మందు వేశారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్‌తో పాటు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్, ఈడీఎల్‌డీఏ రామ్మోహనరావు, చినగదిలి ఏడీ సజ్జ శ్రీనివాస్, వైద్యుడు పి. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం



పూర్ణకలశంతో ప్రదక్షిణ

సింహాచలం, ఆగస్టు 3 : సింహగిరిపై గంగధార సమీపంలో ఉన్న సీతారామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సంక్షిప్త రామాయణం, షడక్షరీ మంత్ర హవనాలను శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం ప్రభాతారాధనలు తరువాత హనుమ, లక్ష్మణ, సీతా సమేత శ్రీరాముడి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో శాస్త్రోక్తంగా బింబారాధన, కలశారాధన, మండపారాధన చేసి హోమకుండలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. శ్రీమద్రామాయణంలోని బాలకాండను సంక్షిప్త రామాయణంగా, శ్రీరామ షడక్షరీ మంత్రాన్ని జపిస్తూ ప్రత్యేక హవనాన్ని జరిపారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 26, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 150, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 44, దోస కాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఆన్‌లైన్ యాప్‌లతో అప్రమత్తం : డీసీపీ



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న క్రైమ్ డీసీపీ వెంకటరత్నం

పద్మనాభం, ఆగస్టు 3 : దురాశకు లోనై ఆన్‌లైన్ యాప్‌ల బారిన పడవద్దని నగర క్రైమ్ డీసీపీ వెంకటరత్నం చెప్పారు. శనివారం ఆమె మద్ది గ్రామస్తులకు చోరీలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పలువురు ఆన్‌లైన్‌లో యాప్‌లు, యూట్యూబ్‌లో స్కీమ్‌లు, వాట్సాప్‌లో పలు రకాల లింక్‌లు పెట్టి ప్రలోభాలకు గురి చేస్తున్నారని చెప్పారు. వారి బారిన పడి ఇప్పటికే చాలామంది లక్షలాది రూపాయలు మోసపోయారని, గ్రామాల్లో రకరకాల స్కీమ్‌లు తీసుకువచ్చి ప్రజలకు వాటిని అలవాటు చేసి అనంతరం మోసం చేస్తున్నారన్నారు. అటువంటి వాటి పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌లకు, యాప్‌లలో వచ్చే సమాచారాన్ని చూసి మోసపోవద్దన్నారు. వీటి ద్వారా ముందుగా మనలను ఎరవేసి, వారి ప్రలోభంలో పడవేసి మోసాలకు గురిచేస్తున్నారన్నారు. బ్యాంకు ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దన్నారు. కొందరు మహారాష్ట్ర, కోల్‌కత్తా, ఢిల్లీ ప్రాంతాల నుంచి వచ్చి దోపిడీలకు పాల్పడుతున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈఏడాది మార్చి నెలలో సత్యనారాయణపురంలో ఇటువంటి దోపిడీ జరిగిందన్నారు.అపరిచిత వ్యక్తులు, అనుమానితుల వివరాలను గమనించినపుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి రక్షణకు సీసీ కెమేరాలు వేసుకున్నప్పుడు నాణ్యమైన వాటిని వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీధర్, రాంబాబు, ఎస్సై మురళీకృష్ణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సింహాచలం, ఆగస్టు 3 : జీవీఎంసీ 98వ వార్డులో బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో భాగంగా ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ తప్పనిసరిగా రక్షణ చర్యలు చేపడతామని ఏపీఈపీడీసీఎల్ అడిషనల్ డీఈ రామునాయుడు తెలిపారు. ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు.ఈమేరకు తొలుత స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తాత్కాలిక రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. ఇదే కారిడార్‌లోని మరో ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపి రెండింటికి శాశ్వత ప్రాతిపదికన పూర్తిస్థాయి రక్షణ కల్పించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఆయన చెప్పారు.

156 మందికి వైద్య పరీక్షలు

సింహాచలం, ఆగస్టు 3 : సింహగిరిపై ఉన్న గిరిజన గ్రామంలో జిల్లా న్యాయ సేవా సంస్థ, సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి రామారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా దుర్గాబజార్ ఆసుపత్రి వైద్యాధికారి మహిత, తదితరులు 156 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. నలుగురికి వైరల్ జ్వరాలు ఉన్నట్టు గుర్తించి రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అప్పలనాయుడు, సుదర్శన్, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి : ఏవో

పద్మనాభం (రూరల్), ఆగస్టు 3 : రైతులు పంటల సాగును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ ఎంవీ చలం తెలిపారు. శనివారం ఆయన పలు గ్రామాల్లో సచివాలయ వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసే రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రతించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏఈఓలు, ఎంపీఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి గిరిజనుల స్థితిగతులపై సమీక్ష

సింహాచలం, ఆగస్టు 3 : సింహగిరిలో వివిధ వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనుల స్థితిగతులపై జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ సమీక్ష నిర్వహించారు.శనివారం సింహగిరిపై గిరిజన కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో గిరిజనులతో మాట్లాడి విద్య, వైద్యం, కాలనీలో మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. గిరిజనుల హక్కుల విషయంలో అధికారులను మొహమాటం లేకుండా అడగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. త్వరలోనే గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో గిరిజన గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం గిరిజన యువత పలు సమస్యలపై ఆమెకు వినతిపత్రం అందజేశారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

'విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించండి'

భీమునిపట్నం, ఆగస్టు 3 : నగరంలో ఈనెల 14న భారీ ఎత్తున నిర్వహించనున్న జెండా ఊంచా రహే హమారా కార్యక్రమం పట్ల స్టూడెంట్స్ యూనైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తిని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. శనివారం కృష్ణమూర్తి నగరంలో సీపీని కలిసి ప్రోమోను వివరించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు తరచూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు.

8న పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నిక

పద్మనాభం (రూరల్), ఆగస్టు 3 : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంఈవో రమణ తెలిపారు. శనివారం ఆయన ఎంఆర్‌పీ భవనంలో విలేకరులతో మాట్లాడారు. 5న ఓటర్ల జాబితా పాఠశాలల్లోని నోటీసు బోర్డుల్లో అతికించి, అదే రోజు నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ఉంటుందన్నారు. 8న ఎన్నికలు జరుపుతాయని తెలిపారు.

సంపత్ వినాయగర్ ఆలయం హుండీ లెక్కింపు

సిరిపురం, ఆగస్టు 3 : సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపును శనివారం ఆలయ కార్యాలయం ఆవరణలో నిర్వహించినట్టు ఈఓ శిరీషా తెలిపారు. గత 28 రోజులకు గాను రూ.18,36,453 నగదు, బంగారం 3 గ్రాముల 320 మిల్లీ గ్రాములు, వెండి 143 గ్రాముల 400 మిల్లీ గ్రాములు, యూఎస్ఏ డాలర్లు 228, కతర్ రియల్స్ 551, మలేషియా రింగిట్ 3 వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్, శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ శాఖ తనిఖీదారులు గాయత్రి, జి. గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాక్సినేషన్

పెదవాల్తేరు, ఆగస్టు 3 : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 21వ వార్డు చినవాల్తేరులోని 13 సచివాలయం పరిధిలోని ఆశా వర్కర్లు 0 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు ఆల్చి అప్పలనారాయణ, ఆశావర్కర్ సీతా రత్నం, ఏఎన్ఎం విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆనంద్ మార్గ్ సాయం

ఆరిలోవ, ఆగస్టు 3 : ఆరిలోవలో ఉన్న అనంద మార్గ్ సభ్యులు అమృత పేరుతో కేరళలోని వరద బాధితులకు సాయం చేశారు. ఈమేరకు బృంద సభ్యులు శనివారం 500 దుప్పట్లు, 500 తువ్వాళ్లు, నిత్యావసర సామగ్రిని తీసుకుని కేరళ వెళ్లారు.

వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు



స్థలం చదును చేయిస్తున్న పోలీసులు

మధురవాడ, ఆగస్టు 3 : మధురవాడ రైతుబజార్‌కు వాహనాలపై వచ్చేవారికి పార్కింగ్ సదుపాయం కల్పించడానికి జీవీఎంసీ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతు బజారుకు సాధారణ రోజుల కంటే ఆదివారం పెద్ద సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. రహదారి ఇరుగ్గా ఉండడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈమేరకు జోన్-2 జీవీఎంసీ అధికారులు, పీఎంపాలెం పోలీసులు చర్యలు చేపట్టారు. గణేష్‌నగర్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని శనివారం పొక్లెయినర్‌తో చదును చేయించారు. ఆ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సీఐ కాంతారావు కోరారు.

భక్తికి నిలువెత్తు నిదర్శనం గరిడీ బృందాలు



గీతాలు ఆలపిస్తూ దర్శనానికి వెళుతున్న గరిడీ బృందం

సింహాచలం, ఆగస్టు 3 : వరాహలక్ష్మీనృసింహస్వామి గీతాలను గ్రామీణ శైలిలో ఆలపిస్తూ... తాళాలు, గజ్జెలతో నర్తిస్తూ కాలినడకన సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకునే గరిడీ బృందాలు భక్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రతి శనివారం అప్పన్న దర్శనానికి వచ్చేవారిలో అధిక శాతం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గ్రామీణ గరిడీ బృందాలుగా వస్తారు. ఈ వారం కూడా కొన్ని బృందాలు సూర్యోదయానికి ముందే సింహాచలం చేరుకుని పుష్కరిణిలో స్నానాలు చేసి పైడితల్లెమ్మను దర్శించుకున్నారు. అనంతరం సింహగిరికి చేరుకుని స్వామివారికి పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.

ఏయూ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉద్యోగుల సమావేశం

వెంకోజీపాలెం, ఆగస్టు 3 : ఏయూలో శనివారం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉద్యోగుల సమావేశం జరిగింది. భవిష్యత్తులో ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధి, సమస్యలపై ఏమి చేయాలన్నది చర్చించారు. సమావేశంలో టీఎన్‌టీయూసీ కార్యవర్గ సభ్యులతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు విభాగాలను తనిఖీ చేసిన రిజిస్ట్రార్



పరిపాలనా విభాగం సిబ్బందితో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కిశోర్‌బాబు

వెంకోజీపాలెం, ఆగస్టు 3 : ఏయూ పరిపాలనా భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిశోర్‌బాబు శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు శాతం, ఫైళ్ల క్లియరెన్స్ వంటివి పరిశీలించారు. సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు.

ఆర్‌వీ పురం పాఠశాలల్లో 'శుభతిథి భోజన్'

పద్మనాభం, ఆగస్టు 3 : మండలంలోని ఆర్వీపురం జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో శుభతిథి-భోజన్ కార్యక్రమంలో భాగంగా 400 మంది విద్యార్థులకు శనివారం మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వెంకటాపురం సర్పంచ్ రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగరాజు స్వీట్లు, అరటి పండ్లు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 రమణ, ఎంఈఓ-2 బాబూలాల్, పాఠశాల హెచ్ఎం శంకరరావు, విద్యా కమిటీ కోఆప్షన్ సభ్యుడు మరగడ అప్పారావు, ఛైర్మన్ రామస్వామి, పల్లా రాము పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపులో ఉద్రిక్తత

- అడ్డుకున్న వ్యాపారులు
- మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, ఆగస్టు 3 : జీవీఎంసీ 22వ వార్డులో శనివారం దుకాణాల తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసు బలగాలు, జేసీబీలతో జీవీఎంసీ సిబ్బంది రావడంతో దుకాణదారులు ఆందోళనకు దిగారు. వార్డులో తోపుడు బండ్లు, దుకాణాలు పూర్తిస్థాయిలో తొలగించాలని కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఎనిమిది నెలలుగా జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. తోపుడు బండ్లు, దుకాణాల వల్ల ఎవరికి ఎటువంటి సమస్య లేకపోవడంతో అధికారులు పట్టించుకోలేదు.దీంతో మూర్తియాదవ్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా వార్డులో దుకాణాలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది.కోర్టు ఆదేశాల మేరకు శనివారం ఉదయం పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది దుకాణాల తొలగింపు చేపట్టారు. కనీస సమాచారం లేకుండా అధికారులు దుకాణాలపై జేసీబీలు ఎత్తడంతో వ్యాపారులు మండిపడ్డారు.ఏళ్ల తరబడి వ్యాపారులు చేసుకుని బతుకున్న దుకాణాలను తీసేస్తే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు.జేసీబీలకు అడ్డంగా నిలబడి అడ్డుకున్నారు. అయినప్పటికీ అధికారులు వినకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు దుకాణదారులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ దుకాణాలు తొలగిస్తే వారికి ప్రత్నామ్నాయం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. మూర్తి యాదవ్‌కు భూములు, కబ్జాలు తప్ప వార్డు సమస్యలు తెలియవని, ఆయన కోర్టుకు వెళ్తే మీరు పేదల పొట్ట కొట్టడం సబబుకాదని హితవుపలికారు. ప్రజా కోర్టు పెట్టి ప్రజలు దుకాణాలు తీసేమంటే తీసేయాలని సూచించారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అధికారులకు ఫోన్ చేసి కోర్టు ఆదేశాలు ప్రకారం దుకాణాలు తీయకపోతే కోర్టు ధిక్కరణ కింద కేసు వేస్తానని బెదిరించడంతో మళ్లీ వచ్చి దుకాణాలు తొలగించారు. ఈ సమయంలో వ్యాపారులు జేసీబీకి అడ్డంగా కూర్చొన్నారు. తమపై నుంచి వాహనాలు ఎక్కించి దుకాణాలు తొలగించాలని భీష్మించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.



జేసీబీకి అడ్డంగా కూర్చున్న దుకాణదారులు



అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదివాసీ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 : ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకూ జరగనున్న ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలను విజయవంతం చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ఆదివాసీ గిరిజనులు సమైక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రూడ సత్యారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డిప్పల సాంబమూర్తి, సరమండ గీత, శోభన్‌కుమార్, డి.పి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ. 2.9 లక్షల జరిమానా

భీమునిపట్నం, ఆగస్టు 3 : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి రూ. 2. 90 లక్షల జరిమానా విధిస్తూ భీమిలి 15వ అడిషినల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. సౌజన్య తీర్పు వెల్లడించారు. భీమిలి ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 29 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శనివారం భీమిలి కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించారని ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి చెప్పారు.

అప్పన్న ఆలయంలో కుంకుమ పూజలు

సింహాచలం, ఆగస్టు 3 : శ్రావణ మాసం పురస్కరించుకుని వచ్చే నాలుగు శుక్రవారాలు లక్ష, సహస్రనామ కుంకుమార్చనలు చేయనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈనెల 9, 16, 23, 30వ తేదీల్లో ఉదయం 7 నుంచి 9 వరకు ఆలయ బేడామండపంలోని సింహవల్లీ తాయార్ సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సాయంత్రం 5.30 నుంచి 6 వరకు సహస్రనామ కుంకుమార్చన జరుగుతుందన్నారు. రూ.2500 చెల్లించిన భక్తులు లక్ష కుంకుమార్చనలో, రూ.500 చెల్లించిన వారు సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొనవచ్చునని చెప్పారు.